క్లుప్తంగా

ఘనంగా అన్న సమారాధన



శ్రీ కామాక్షి అమ్మవారికి మహానివేదన సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని వన్‌టౌన్ ఓవర్ బ్రిడ్జి దగ్గర ఉన్న శ్రీ కామాక్షి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు ముగింపు సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి అన్న సమారాధనను నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ యువజన సంఘం సభ్యులు పుట్ట నాగ ఫణి కుమార్, మందరపు వసంత్, ఆవుపాటి జగన్, అనుపోజు మురళీకృష్ణ, తమిళ్ సుబ్రమణ్యం, విశ్వబ్రాహ్మణ పట్టణ అధ్యక్షులు శ్రీశైలపు నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: స్థానిక మోగల్లు రోడ్డు కొత్తపేట శ్రీ విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం దసరా మహోత్సవ వేడుకలు ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించాచరు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నిట్టా ధర్మేంద్ర ఫణి శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవాల్లో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీర జాకెట్లు వేలం నిర్వహించారు. కార్యక్రమంలో ఇళ్ల రమేష్ రాజు, కారింకీ శ్రీను, మున్నలూరి సత్యనారాయణ మూర్తి, బొర్రా శ్రీను, చైతన్య, వినయ్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు అధికారుల వేధింపులు ఆపాలి

భీమవరం: పేద, మధ్య తరగతి తీసుకొనే బ్యాంకు రుణాలపై విరుచుకుపడే బ్యాంకులు కార్పొరేట్లు తీసుకొనే వేల కోట్ల రుణాల ఎందుకు రద్దు చేస్తున్నారు? అని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ ప్రశ్నించారు. శుక్రవారం భీమవరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద మత్యతరగతి ప్రజలు తీసుకున్న టిడ్కో గృహాల లోన్లు, హౌసింగ్ లోన్లు కట్టమని బ్యాంకు యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని మండిపడ్డారు. వెంటనే ఈ వేధింపులను ఆపాలని డిమాండ్ చేశారు.

శక్తి యాప్‌పై అవగాహన

భీమవరం: స్థానిక ఆర్ఆర్ డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏ ఎస్ ఆర్ నగర్ సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శి షెహనాజ్ సయ్యద్ యాప్ వాడకంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీకేజే ప్రసూన, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ జి.ఉమామహేశ్వరి, డాక్టర్ పి.అరవిందస్వామి, డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి మకర తోరణం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక సోమేశ్వర స్వామి దేవస్థానంలోని అన్నపూర్ణ అమ్మవారికి 19.5 కేజీల వెండి మకర తోరణం అందించడం గొప్ప విశేషమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. సోమేశ్వరాలయం ట్రస్ట్ బోర్డు సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే అంజిబాబును కలిసి మకర తోరణ వివరాలను తెలిపారు. ఆదివారం ఉదయం 11.30 గంటలకు అమ్మవారికి సుమారు రూ.30 లక్షలు విలువైన 19.5 కేజీల వెండితో తయారుచేసిన మకర తోరణం అలంకరిస్తున్నామని తెలిపారు. ఆలయ చైర్మన్ చింతలపాటి బంగార్రాజు మాట్లాడుతూ అమ్మవారికి వెండి మకర తోరణాన్ని పట్టణానికి చెందిన బోండా వెంకట సుబ్రహ్మణ్య (బుజ్జి బాబు) అందిస్తున్నారని పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి



ఆర్టీసీ డిపో నుంచి నర్సయ్య అగ్రహారం వెళ్లే రోడ్డు దుస్థితి

భీమవరం: ఆర్టీసీ డిపో నుంచి నర్సయ్యఅగ్రహారం(తణుకు) వెళ్లే రోడ్డు నిర్మాణం ఎప్పటికీ పూర్తి చేస్తారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి జక్కం శెట్టి సత్యనారాయణ ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రటకన విడుదల చేశారు. భీమవరం ఆర్టీసీ డిపో వద్ద రోడ్డు నిర్మాణం పనులు నెలల తరబడి సాగుతూ ఉన్నాయని మండిపడ్డారు. అదే మార్గంలో కేంద్ర మంత్రి కార్యాలయం, నివాసం ఉన్నప్పటికీ రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదని ఎద్దేవా చేశారు. ఈ రోడ్డు నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్ నిర్మాణ పని వేగవంతంగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్తమూరు ఎస్సీ కాలనీలో సమస్యల తిష్ట

- అధ్వానంగా పారిశుధ్యం
- ప్రజలు అనారోగ్యాలపాలవుతున్నా పట్టించుకోని అధికారులు

ఉండి: మండలంలోని ప్రధాన గ్రామమైన అర్తమూరు ఎస్సీ కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. పంచాయతీ కార్యాలయనికి పక్కనే ఉన్న దళితవాడ అభివృద్ధిని అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదు. కాలనీలో వెళ్లాలంటే దుర్గంధం ప్రజలకు స్వాగతం చెబుతున్నారు. డ్రెయిన్‌లు లేకపోవడంతో వాడకం నీరు, వర్షం నీరు కలిసి రోడ్లపైనే నిలిచి ఉంటుంది. ఈ కాలనీలోని ప్రధాన రహదారిలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సీసీ రోడ్డు పాడైపోవడంతో మురుగునీరు నిలిచిపోయింది. అలాగే కాలనీ ప్రధాన సెంటర్‌లో అత్యంత దారుణమైన పరిస్థితి నెలకొంది. రోజులతరబడి మురుగునీరు నిలిచిపోవడంతో దాని నుండి వచ్చే దుర్గంధానికి ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. కనీసం మురుగునీరు బయటకు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకుంటే దుర్గంధం తగ్గిపోతుందని స్థానికులు చెబుతున్నా, అధికారులు మాత్రం పెడచెవిన పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దళితవాడలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పట్టించుకోవడం లేదు.



అర్తమూరులో దళిత కాలనీ సెంటర్‌లో అధ్వానంగా ఉన్న పారిశుద్ధ్యం



దారుణంగా కాలనీ ప్రధాన రహదారి



కాలనీలో రోడ్లపై నిలిచిన మురుగునీరు

పట్టించుకోవడం లేదు



మా పరిస్థితిపై అధికారులకు విన్నవించినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. డ్రెయిన్స్ లేవు. తాగునీరు అధ్వానంగా ఉంటుంది. మురుగునీరు రోడ్లపైనే ఉంటుంది. అది ఎటూ వెళ్లే అవకాశం లేకపోవడంతో రోడ్లపైనే నిలిచి ఆరోగ్యాలు పాడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు మమ్మల్ని పట్టించుకోవాలి.

– జొన్నల వజ్రం,ఎస్సీ కాలనీ,అర్తమూరు.

వచ్చి చూస్తే అర్థమవుతుంది



గ్రామంలోని ఇతర ప్రాంతాలపై శ్రద్ధ చూపించే అధికారులు, ప్రజాప్రతినిధులు దళితుల కాలనీలను ఎందుకు పట్టించుకోరు? దీనికి అర్తమూరు దళిత కాలనీ ఉదాహరణగా నిలుస్తుంది. మేం చెప్పేది నిజమో? అబద్ధమో? అధికారులు పర్యటించి పరిశీలించాలి. మా బతుకులు ఎంత దుర్భరంగా ఉన్నాయో అర్థం అవుతుంది. కనీసం వచ్చి చూడండి.

– పాముల అబ్రహం, ఎస్సీ కాలనీ, అర్తమూరు

మేం లెక్కల్లో లేమా?



తరాలు మారుతున్నాయి. కాలాలు మారుతున్నాయి. కానీ మా బతుకుల్లో, మా ప్రాంతాల్లో మాత్రం మార్పు రావడం లేదు. పారిశుద్ధ్యం విషయం అధికారులు అస్సలు పట్టించుకోవడం లేదు. పేరుకే సీసీ రోడ్డు.. కానీ ఉపయోగం మాత్రం లేదు. ఉన్నతాధికారులు మా కాలనీకు ఒక్కసారి వచ్చి చూస్తే మా దుస్థితి తెలుస్తుంది.

– రామకూరి వెంకటరత్నం, ఎస్సీ కాలనీ, అర్తమూరు

బోధనేతర యాప్‌ల బహిష్కరణ



కాళ్ల: ఎంఈఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు



ఆకివీడు: ఎంఈఓ రవీంద్రకు నోటీసు ఇస్తున్న ఫ్యాప్టో ఉద్యోగ సంఘ నాయకులు

కాళ్ల: మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వలన బోధన సమయం హరించుకుపోతున్నదని, ఉపాధ్యాయులకు కూడా బోధనపై ఆసక్తి తగ్గిపోయే విధంగా బోధనేతర కార్యక్రమాలు పెరిగిపోయాయని ఫ్యాప్టో నాయకులు సీహెచ్ పట్టాభిరామయ్య మండిపడ్డారు. అక్టోబర్ 10వ తేదీ నుండి బోధనేతర కార్యక్రమాలను బహిష్కరించాలని రాష్ట్ర ఫ్యాప్టో ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం కాళ్ల ఎంఈఓ డి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్నం భోజన పథకమునకు సంబంధించిన పనులు, మూల్యాంకానికి సంబంధించిన పరీక్ష నిర్వహణ తప్ప ఏ ఇతర బోధనేతర పనులు గాని, అనవసరమైన గూగుల్ షీట్స్ నింపడం గానీ, విద్యాశక్తి లాంటి సీజనల్ ప్రచార కార్యక్రమాలను ఉపాధ్యాయులు చేపట్టరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు సీహెచ్ కుమార బాబ్జి, బీఆర్ఎంకే స్వామి, పి.పాపారావు, వి.గణేష్, ఎం.శంకర్రావు, సీహెచ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడులో...

ఆకివీడు: బోధనేతర పనులను శుక్రవారం నుంచి బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో మండల నాయకులు తెలిపారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారికి నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల కార్యదర్శి ఆర్వీఎస్ నారాయణ(విక్రమ్) మాట్లాడుతూ బోధనేతర, విద్యాశక్తి, గూగుల్ షీట్స్ నింపడం, జీఎస్‌టీ 2.0 లాంటి సీజనల్ ప్రచార కార్యక్రమాల్ని బహిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు తోట వెంకటేశ్వరరావు, రమేష్, ఎండీ ఇస్మాయిల్, యూటీఎఫ్ నాయకులు బైరి లక్ష్మీ నారాయణ, ఐ.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు

ఆకివీడు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పూర్వపు విద్యార్థి సంఘం అధ్యక్షుడు గొంట్లా కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదవాలన్నారు. జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



మాట్లాడుతున్న గొంట్లా కృష్ణమూర్తి

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దారుణం

ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్

కాళ్ల: కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ పేరుతో ప్రైవేటీకరణ చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నరసింహరాజు మండిపడ్డారు. ఈ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ ప్రారంభిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం కాళ్ల మండలం పెదఅమిరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీ పేద మధ్యతరగతి విద్యార్థుల ప్రయోజనాలతో జిల్లాల వారీగా వైద్య విద్య వైద్య సేవలు అందించేందుకు స్థాపించారన్నారు. ప్రైవేటీకరణ జరిగితే పేద విద్యార్థులకు వైద్య విద్య అందనంత దూరమవుతుందన్నారు. ఫీజులు భరించలేనంతగా పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందుబాటులో లేకుండా పోతుందని వాపోయారు. కూటమి ప్రభుత్వం పీపీపీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ నాయకులతో కలిపి పోస్టర్‌ను ఆవిష్కరించి, నియోజకవర్గ స్థాయిలో తొలి సంతకాన్ని పీవీఎల్ నరసింహరాజు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పెనుమత్స దుర్గాప్రసాద్ రాజు, ఉండి జెడ్పీటీసీ రణస్థుల మహంకాళి, కాళ్ళ, ఉండి, పాలకోడేరు, ఆకివీడు మండలాల పార్టీ అధ్యక్షులు గణేశ్న రాంబాబు, పెనుమత్స ఆంజనేయరాజు, పాపారావు, నంద్యాల సీతారామయ్య, పార్టీ జిల్లా ట్రెజరర్ వేగేశ్న జయ రామకృష్ణంరాజు, నాయకులు చేకూరి నరేంద్ర, గలవెల్లి ధనుంజయ్, డొక్కు సుబ్రమణ్యం, అంబటి రమేష్, మంతెన సునీల్ వర్మ, గోరుముచ్చు సుందర్ కుమార్, గుండు నాగేశ్వరరావు, శ్రీను, పెనుమత్స రంగరాజు,వేగేశ్న నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీవీఎల్



మొదటి సంతకం చేస్తున్న ఇన్‌చార్జ్ పీవీఎల్ నరసింహరాజు

ధన్ ధాన్య కార్యక్రమానికి తరలిరావాలి

ఉండి: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో శనివారం దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించే ధన్ ధాన్య కృషీ యోజన, పప్పుధాన్యాల స్వావలంభన మిషన్ ప్రారంభోత్స కార్యక్రమాన్ని ఎన్నార్పీ అగ్రహారం కృషీ విజ్ఞాన కేంద్రంలో ప్రత్య ప్రసారం చేస్తున్నామని ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లిఖార్జునరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో రైతులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

ఎన్టీఆర్ వైద్యసేవల నిలిపివేత

పాలకొల్లు సెంట్రల్: ఎన్టీఆర్ వైద్య సేవలందించే ఆసుపత్రులు శుక్రవారం తమ వైద్య సేవలను నిలుపుదల చేశారు. పట్టణంలో ఉన్న రెండు ఆసుపత్రుల్లో బయట 'ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల బతుకు భారమైంది నడక కష్టమైంది' 10 నుంచి వైద్య సేవలు బంద్ అంటూ నోటీసు బోర్డులు అంటించడంతో రోగులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

ఏటీవీ వెహికల్ పోటీల్లో ప్రతిభ

భీమవరం: ఫార్ములా ఆఫ్ రోడ్ మినీ భజ్ ఇండియా (ఫోమ్‌బి) ఏటీవీ వెహికల్ పోటీల్లో ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ బ్రాంచ్ విద్యార్థులు చాంపియన్ నిలిచారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ లో ఇస్ని మోటార్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 25 నుంచి 29 వరకు భోపాల్‌లోని సాగర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ క్యాంపస్‌లో పోటీలు నిర్వహించారని పేర్కొన్నారు. అందులో 23 మంది విద్యార్థుల బృందం ‘టీం గోదావరి’ పేరిట పోటీల్లో పాల్గొన్నారు. విజేతగా నిలిచి జ్ఞాపికలతో పాటు రు.90 వేల రూపాయలు నగదు బహుమతి కూడా అందుకున్నారని తెలిపారు.టీం సభ్యులను శుక్రవారం మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ కలిదిండి సీతారామరాజు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్స్ ఎన్ సుదీర్ కుమార్ వర్మ, యు.రాజేంద్రప్రసాద్ తదితరులు అభినందించారు.



బహుమతులు గెలుచుకున్న విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

పాలకోడేరు: మండల స్థాయిలో ధాన్యం కొనుగోలుపై శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారిణి బి.సంధ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం నాణ్యత ప్రమాణాలు ఏ విధంగా చూడాలి? కనీస మద్దతు ధర గోనె సంచుల సరఫరా తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన భీమవరం వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో 2025వ సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్ ధాన్యం కొనుగోలు విధానాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సొసైటీ సీఈఓలు, రైస్ మిల్లర్స్, కస్టోడియం అధికారులు, వీఏఏలు, టీఏలు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాస్

ఘనంగా ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



భీమవరం: మాట్లాడుతున్న న్యాయమూర్తి జ్యోతి



భీమవరం (ప్రకాశంచౌక్): మాట్లాడుతున్న మానసిక వైద్యుడు జీవి రమణరావు

భీమవరం: ‘జన్యుపరమైన లోపాలు, మేనరిక వివాహాలు చేసుకోవడం వంటి కారాణాల వల్ల పిల్లలు మానసిక వైకల్యంతో పుడతారని, వారిని సాధారణ పిల్లలతో కలిపి ఉంచడం వల్ల వారి మానసిక స్థితి మెరుగుపడుతుందని భీమవరం రెండో అదనపు జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్.జ్యోతి అన్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత మానసిక వైకల్య కేంద్రంలో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహనా సదస్సులో న్యాయమూర్తి పాల్గొన్నారు. జిల్లా ఐఈ కోఆర్డినేటర్ టి. శ్రీనివాస్ మాట్లాడుతూ భవిత కేంద్రంలో పిల్లలకు స్పీచ్ థెరపి ద్వారా సాధారణ పిల్లల్లాగానే మాట్లాడేలా, వస్తువులను, మనుషులను గుర్తించేలా శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు అంబేడ్కర్, భవాని, మీడియేషన్ న్యాయవాది విజయలక్ష్మి, ఐఈఆర్‌టీ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో

భీమవరం (ప్రకాశంచౌక్): నేటి పోటీ ప్రపంచంలో చాలా మంది ఒత్తిడిని తట్టుకోలేక పోతున్నారని, మానసిక వ్యాధులతో బాధ పడేవారి సంఖ్య పెరుగుతుందని ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ జీవి రమణరావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి హాస్పిటల్లో ప్రపంచ మానసిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమణరావు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను మించి వారిపై ఒత్తిడి చేస్తున్నారని, తల్లిదండ్రులు ఆలోచనల్లో కూడా మార్పు రావాలని సూచించారు. కార్యక్రమ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించాలి

ఉండి: ఒత్తిడి లేకుంటేనే మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా వుంటాడని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫ్యాకల్టీ(విజయవాడ)దండు దుర్గాదేవి అన్నారు. శుక్రవారం ఉండి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్‌లో మెంటల్ హెల్త్ వెల్‌బీయింగ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కెరియర్ గౌడెన్స్ మోటివేటర్ కలిగొట్ల గోపాలరావు మాట్లాడుతూ ఒత్తిడి నుండి బయటపడేందుకు, ధ్యానం, యోగా చేయాలని సూచించారు. అనంతరం క్లబ్ ఆధ్వర్యంలో అతిథులు దుర్గాదేవి, గోపాలరావును సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పెన్మత్స రంగప్రసాదరాజు, హెచ్ఎం వై.రామలక్ష్మీ, సత్తి బ్రహ్మారెడ్డి, కాగిత మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీటిలోనే ప్రయాణం

కాళ్ల: ఏలూరుపాడు గురువు ప్రాంతంలో లోతట్టుగా ఉండటంవల్ల ఎప్పుడు వర్షం కురిసిన రోజుల తరబడి వర్షపు నీరు నిలిచి ఉండడంవల్ల ఇబ్బందులు పడుతున్నామని గరువు ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గరువు ప్రాంతంలో సీసీ రహదారి పల్లం కావడం వల్ల గత ఐదేళ్లగా వర్షాలు కురిస్తే మురుగునీటిలోనే రాకపోకలు సాగించాలని దుస్థితి ఏర్పడిందని ఆ ప్రాంత ప్రజలు శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ వర్షం కురిసిన ప్రతిసారి విషసర్పాలు ఇళ్లల్లోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు పడుతూ లేస్తూ వెళ్లాల్సిన పరిస్థితి కూడా ఉందని వాపోయారు. నీళ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండటం వల్ల దోమలు ప్రబలి వ్యాధుల బారిన పడుతున్నామని తెలిపారు. ప్రతి ఏటా ఈసమస్యను పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లినా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి శాశ్వత పరిష్కారానికి మార్గం చూపాలని ప్రజలు కోరారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఎస్.అరుణాదేవి వివరణ కోరగా స్థానికులు సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని, వెంటనే స్పందించి మురుగనీటిని బయటికి మళ్లించామని అదేవిధంగా ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు కూడా సిద్ధం చేశామని ఆమె స్పష్టం చేశారు.



సమస్యను చెబుతున్న ఏలూరుపాడు గురువు మహిళలు



వర్షపు నీటిని బయటకు మళ్లిస్తున్న పంచాయతీ సిబ్బంది